# నాణేనికి అటూ ఇటూ

రమేష్ రాయ్

''ఈ పిక్చర్‌కా?'' తెల్లబోయింది వనజ, సాకేత్ ఆ పిక్చర్‌కి లాక్కొచ్చే సరికి.

మాట్లాడకుండా బుకింగ్‌లోకి పోయి టికెట్స్ తెచ్చాడతను.

చివరి వరుసలో కుర్చీలెతుక్కుని కూలబడుతూ ఆమె చెవిలో అన్నాడతను చిన్నగా-

''ఇప్పుడర్థమైందా? బ్లాక్ అండ్ వైట్ సిన్మాకు ఎందుకు తీసుకొచ్చానో?''

జనాలు పల్చగా ఉన్నారు. అక్కడొకరూ... అక్కడొకరూ!

ముఖ్యంగా పరిచయస్తులు పాత సిన్మాల్లో కనబడే అవకాశం తక్కువ.

అర్థమై, మెరిసే కళ్ళతో- ''య్యూ, ఛాల్‌బాజ్'' అంటూ నవ్వింది.

ఏదో ఆడియో బీట్,...లైట్స్ ఆఫ్... బ్యానర్ ఎంబ్లమ్...మెలోడీతో టైటిల్స్. సిన్మా నడుస్తోంది.

ఇద్దరి భుజాలూ ఇంతకు ముందుకంటే కొంచెం దగ్గరగా ఉన్నాయి.

ఆమె చేతిని మెల్లగా తీసుకున్నాడు. అట్నుంచి కొంచెం అంగీకారం, కొంచెం తిరస్కారం.

మరికొంత దగ్గరికి జరుగుతూంటే ఆమె చెంపల సామీప్యం తోచింది. గుండె సన్నగా వణికింది.

ముద్దు. చిన్నముద్దు. మళ్ళీ మరో ముద్దు.

ఏకోస్ బడ్‌కర్ ఏక్. పరంపర! చెంపమీంచి పెదాల పైకి! తన్మయరాగం ఒంట్లో పలికించే చోటు- 'అధరకాగితం'... ముద్దు సంతకం... లెక్కించటమే వ్యర్థం!

సిన్మాలో శుభం కార్డు పడగానే చీకటొక్కసారిగా మాయమైంది. లైట్ల వెలుగులో ఆమెకి సిగ్గుగా ఉంది జరిగింది గుర్తొస్తూంటే. తల దించుకొని నడుస్తోంది. ప్రక్కగా చేయిపట్టుకొని అతనూ!

ఆటోలో కూర్చొని హోటల్ పేరు చెప్పాడు.

ఆమె బిత్తరపోయి, ''హోటల్‌కా?! ఇప్పుడా! అంది.

''ఊ! ఏం?... లంచ్ చేద్దామక్కడ!''

హోటల్ రష్‌గా ఉంది. కానీ, సెపరేట్ పార్టీషన్ ఉండటంతో ఒకింత ప్రైవసీ!

''చెప్పు, ఏం ఆర్డరిద్దాం?''

మాట్లాడకుండా అతని కళ్ళలోకే చూస్తూందామె.

''చెప్పూ!''

చూపుల్ని తిప్పుకొని నవ్వుతూ, ''నీ ఇష్టం'' అంది.

అతను ఆర్డరిచ్చాడు. వెయిటర్‌ని పంపించేసి ఇద్దరూ ఒకటే ప్లేట్‌లో భోంచేశారు.

''వనజా! రవిశంకర్ అనీ నాస్నేహితున్ని పరిచయం చేశాను గుర్తుందా?''

ఆమె గుర్తుకు తెచ్చుకొని ''ఊ..ఊ'' అంది.

''ఈ హోటల్ అండ్ లాడ్జి వాళ్ళదే. అందుకే...''

ఆగి చేతులు తుడుచుకుంటూ తిరిగి అన్నాడు-

''లాడ్జ్‌లో మనకి ఓ సూట్ దొరికింది''

అదిరిపడిందామె ''వ్వాట్''

నవ్వుతూ- ''డోంట్ ఫియర్. అనవసరంగా ఏవేవో ఊహించుకోకు. మనం ఇంకొద్దిసేపు స్పెండ్ చేయటానికి మాత్రమే ఈ ఏర్పాటు''.

రూమ్‌లోకెళ్ళాక అంది- ''నిజంగా, ఇదంతా భలే థ్రిల్‌గా ఉంది.''

''ఇది కూడానా?'' అన్నాడు.

ఏదన్నట్టు ప్రశ్నార్థకంగా చూసిందామె.

లాక్కొని కౌగిలించుకున్నాడతను. ఫక్కున నవ్వుతూ విడిపించుకుందామె.

బెడ్‌మీద ఆమె ఒళ్ళో పడుకొని చాలాసేపు కబుర్లాడుతుండిపోయాడు.

అంతకుమించి అడ్వాంటేజీ అతను తీసుకోలేదు- వాళ్ళ ప్రైవసీకి ఎటువంటి భంగమూ లేనప్పటికీ!

ఓ రోజు జంటగా వారిద్దరూ అతని తల్లిదండ్రుల కంటబడ్డారు మరోచోట.

తండ్రీ, కొడుకుల మధ్య తీవ్రమైన వాగ్యుద్ధం జరిగింది.

• • •

ఎర్రగా పొంగుతోన్న సముద్రం మీంచి దృష్టిని ప్రక్కనే కూర్చున్న వనజ మీదికి మళ్ళించాడు. చెప్పాలీ- తను ఆమె కోసం ఇంట్లో ఎదురించొచ్చింది చెప్పాలీ, రిజిష్టర్ మ్యారేజీ విషయమూ చెప్పాలీ, కాని గుండె వణుకుతోంది. 'ఎలా?' అనుకుంటూ ఆమె చేయందుకున్నాడు.

''వనజా! నీవు లేకుండా నేను బ్రతకలేనేమో అనీ చాలాసార్లు అన్పిస్తూంటుంది. ఏంటో!''

అతని చేతిని చెంప క్రింద దాచుకుంటూ-

''మనది జన్మజన్మల బంధం సాకేత్! నువ్వు నా ఆరోప్రాణం కదూ!'' అందామె.

''నిన్న మా ఇంట్లో వాదన జరిగింది వనజా! అది చిలికి చిలికి పెద్దదయింది. మన ప్రేమ గురించే అది. వాళ్ళకి తెల్సిపోయింది''



ఆమె ఉలిక్కిపడింది. అతని చేతిని వదిలేసింది.

అతను చెప్పుకుపోతున్నాడు-

''నేను ఏమాత్రం భయపడలేదు. జంకలేదు. ఎదురు తిరిగాను. నువ్వు లేనిదే బ్రతకలేనన్నది చెప్పాను. పెళ్ళంటూ చేసుకుంటే నిన్నే అని కూడా చెప్పాను. వాళ్ళనే కాదు, ప్రపంచాన్ని కూడా ఎదిరిస్తానని చెప్పాను. ఎదిరించడానికి సిద్ధంగా ఉన్నాను. ఆస్తినివ్వబోమంటే అక్కర్లేదని వచ్చేశాను. చెప్పు, వనజా! మనమెప్పుడు పెళ్ళి చేసుకుందాం?''

''స్టా...పి...ట్.'' అంటూ అరిచిందామె అతని మాటలు పూర్తిగాకముందే.

అతనాశ్చర్యపోయాడు. ఆమె మొహంలో రంగులు మారుతూంటే.

''ఏమిటి సాకేత్, ఏం మాట్లాడుతున్నావ్? పెళ్ళంటావేమిటి? నేనసలు ఎప్పుడైనా ఆ ఉద్దేశ్యంతో మాట్లాడానా? నువ్వే అనవసరంగా ఏదేదో ఊహించుకున్నావ్. మీ ఇంట్లో వాళ్ళను ఎదిరించేముందు కనీసం నా ఉద్దేశ్యమేమిటో కనుక్కున్నావా? అసలు ప్రేమించానని నేను నీకు చెప్పానా?''

బ్లాంక్ అయిపోయాడతను. అతనూహించలేదు 'ఐలవ్ యూ' అనే ప్రాణపూరిత అక్షరాలు

సాక్ష్యం చూపించాల్సి ఉంటుందనీ. డూ యూ లవ్ అని తను అడిగి, ఐలవ్ యూ అని ఆమె వ్రాస్తే 'అప్పుడు మాత్రమే' అది ప్రేమ అవుతుందని,... అతనెంత మాత్రం ఊహించలేదు.

''అంటే,... అంటే, నువ్వు ప్రేమించలేదా వనజా!''

''లేదు!''

''మరి, నేను లేని జీవితం అసాధ్యం అన్నావ్!''

''ఔను సాకేత్! అర్థం చేస్కో! దానికీ, ప్రేమకీ సంబంధమేమిటో?''

మూగవాడయి పోతున్న భావన. ''వనజా! ఇదంతా,... ఇదంతా ఏమిటి మరి?''

''స్నేహం''

స్నే...హ...మ్! అలలు విరిగిపడ్డ విస్ఫోటనపు చప్పుడు.



''స్నేహమా? స్నేహమా? ఏది స్నేహం?...

సిన్మాలకీ షికార్లకీ తిరగటమా? హోటళ్ళలో షేర్ చేసుకోవడమా?''

మధ్యలోనే ఆపేస్తూ ఆమె- ''అదంతా స్నేహపూర్వకంగానే నేను...'' ఏదో చెప్పబోయింది.

మాటల్నింకా ఆమె పూర్తి చేయకముందే అరిచాడతను-

''స్నేహమ్, స్నేహమ్, స్నేహమ్!! ఏమిటి నువ్వంటున్న స్నేహమ్? స్నేహమే అయితే ఇటు జవాబివ్వు- నాతో సిన్మాకొచ్చినట్టు మధుకర్‌తో రాగలవా? నాతో హోటల్‌కొచ్చినట్టు రవిశంకర్‌తో రాగలవా? నన్ను ముద్దుపెట్టుకున్నట్టే వాళ్ళనీ ముద్దు పెట్టుకోగలవా? ఏం వాళ్ళూ నీకు స్నేహితులేగా!''

మౌ...నం! నిశ్శబ్దంలాంటి మౌనం! ప్రశ్నల్లా కడలి తరంగాల హోరు!

తిరిగి అతనే అన్నాడు మెల్లగా- ''వనజా! నువ్వు నాకిప్పుడర్థ మవుతున్నావ్. ఇప్పుడిప్పుడే!''

అతనింక ఒక్కక్షణమాగకుండా వడివడిగా అక్కన్నుంచి వచ్చేశాడు.

• • •

ఇంటిముందు లాన్‌లో, ఆకాశంలో చుక్కల్ని చూస్తూ ప్రక్కనే తాతయ్య పాడుతోన్న ఏదో కీర్తనని పరధ్యానంగా వింటున్నాడు సాకేత్.

తన చుట్టూ చాలామంది ప్రేమికుల్ని చూస్తున్నాడతను. ప్రేమని పెళ్ళిదాకా తీసుకెళ్తున్న వాళ్ళు చాలా చాలా అరుదు.

అబ్బాయిలు- కట్నం పోగొట్టుకోవడం రిస్క్‌గా భావిస్తున్నారు.

అమ్మాయిలేమో- అసలు, ప్రేమించినవాన్ని పెళ్ళాడటమే రిస్క్‌గా భావిస్తున్నారు. తల్లిదండ్రుల్ని, సొసైటీని ఎదురించాలీ. ఎవరీ సపోర్టు ఉండదు. ఆర్థికపరమైన ఇబ్బందులు. నో సెక్యూర్టీ.

అదే తల్లిదండ్రులతో కమిటయితే, మంచి స్టేటస్‌లో ఉన్న వరుణ్ణి వాళ్ళే కొనిపెడ్తారు. వేదమంత్రాల సాక్షిగా భద్రతకి హామీ ఇస్తారు(?) నో రిస్క్(?).

కాని, అంతమాత్రాన ప్రేమ ఎందుకు మిస్సవ్వాలీ? ఆ థ్రిల్ కూడా తమకి కావాలి.

బాయ్‌ఫ్రెండ్! తన కోసం ఓ బాయ్‌ఫ్రెండ్ తపిస్తుండాలి. తను కరుణిస్తుండాలి. అదే ప్రేమ!

'పెళ్ళి' అనే మాటెత్తితే,... నో, వద్దు! ఒప్పుకోవద్దు. అది రిస్క్.

అతని మనసు వికలమైనట్టనిపిస్తోంది.

కళ్ళముందు ఓ అమ్మాయి తోస్తోంది. మది నిండా ప్రేమనీ, కళ్ళనిండా కలత, అనుక్షణం నింపుకొని ఆరాధించీ,

...ప్రేమికుడు పెళ్ళి చేసుకోనంటే ఆత్మహత్య చేసుకున్న అత్తయ్య ఒకవంకా-

...పెళ్ళి చేసుకుంటానంటే ఆత్మవంచన చేసుకొని పారిపోతున్న వనజ కూడా ఒకసారి అతని మనోఫలకంపై కనిపిస్తున్నారు.

★